అన్ని వసతులతో వైద్యం

- రూ.4 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణం
- అందుబాటులోకి అత్యవసర వైద్య సేవలు
- ప్రారంభానికి సిద్ధమైన గూడూరు సీహెచ్‌సీ భవనం


ప్రారంభోత్సవానికి సిద్ధమైన గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం

గూడూరు: నిరుపేదల వైద్యానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. మెరుగైన వైద్య సేవలు అందాలన్న లక్ష్యంతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చొరవతో గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం నాబార్డు ద్వారా రూ.4 కోట్లు మంజూరు చేసింది. గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఆస్పత్రిని సుమారు 20 ఏళ్ల కిందట 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. ఆనాటి ప్రభుత్వం కనీస వసతులు కల్పించకపోవడంతో పేరుకే 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో పెడన ఎమ్మెల్యేగా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న జోగి రమేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు సాధించడమే కాకుండా 2020 డిసెంబర్ 22న ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రారంభానికి సిద్ధం

మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఆధ్వర్యంలో అధునాతన వసతులతో చేపట్టిన ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. రెండు అంతస్తులలో నిర్మించిన భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేశారు. మొదటి అంతస్తులో రోగులను పరీక్షించేందుకు ఒక్కో వైద్యుడికి ఒక్కొక్కటి చొప్పున నాలుగు ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేశారు. వీటితో పాటుగా నేత్ర పరీక్షలు, దంత పరీక్షలు, మైనర్ ఓటీ, ఫార్మసీ, ల్యాబొరేటరీ వంటివన్నీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేశారు. బ్లడ్ బ్యాంక్ కోసం కూడా ప్రత్యేక గదిని కేటాయించారు. మొదటి అంతస్తు మొత్తం ఇన్ పేషెంట్లకు కేటాయించారు. చిన్నారులు, గర్భిణులు, మహిళలు, పురుషులకు ప్రత్యేక వార్డులతో పాటుగా కరోనా వంటి పేషెంట్ల కోసం ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశారు. రోగుల పర్యవేక్షణకు వైద్యుడు, నర్సులకు ప్రత్యేక గదులు కేటాయించారు.


అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన ట్రామా కేర్ యూనిట్

అన్ని విధాలా అభివృద్ధి



గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం. పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారు. సీఎం ఆశయానికి అనుగుణంగా గూడూరు ఆస్పత్రిని తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేశాం. నూతన భవనం ప్రారంభంతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయి.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

అందుబాటులో సేవలు



ఆస్పత్రి భవన నిర్మాణంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. రోగులను పరీక్షించేందుకు వైద్యులకు ప్రత్యేక చాంబర్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వైద్యులకు ప్రత్యేక చాంబర్లు, అన్ని సేవలు ఒకే భవనంలో ఉండేలా నిర్మాణం చేయడంతో రోగులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– కె.జ్ఞానరత్న, వైద్యాధికారి

అత్యవసర సేవలు అందుబాటులో

మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సేవలు అందించేందుకు క్యాజువాలిటీ విభాగం కూడా ఏర్పాటు చేశారు. బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులు రూ. 40 లక్షలతో ఆస్పత్రిలో ట్రామా కేర్ యూనిట్‌ను నెలకొల్పారు. దీనిలో భాగంగా డిజిటల్ ఎక్స్‌రే, ఆక్సిజన్ సదుపాయంతో కూడిన పడకలు, డిజిటల్ ఆక్సిజన్, పల్స్ ఇండికేటర్లు వంటివి సమకూర్చారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అవకాశం లభించింది.

రైతులకు ఎటువంటి నష్టం జరగనివ్వం

ఎమ్మెల్యే పేర్ని నాని హామీ

కోనేరుసెంటర్: పోర్టు అభివృద్ధికి సహకరిస్తూ అవసరాల నిమిత్తం ప్రభుత్వానికి భూములు అందజేసే రైతులకు ఎటువంటి నష్టం జరగనివ్వమని బందరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) తెలిపారు. పెదకరగ్రహారం కాపుటూరు, చినకరగ్రహారం పల్లెపాలెంలోని పోర్టు రహదారుల నిర్మాణానికి అవసరమైన భూములకు సంబంధించిన రైతులతో శుక్రవారం పేర్ని నాని రెవెన్యూ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోర్టు రహదారుల అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు 31.5 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించేలా కృషి చేస్తానన్నారు. పోర్టు నిర్మాణంతో బందరు ప్రాంత అభివృద్ధే కాకుండా అన్ని కుటుంబాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. 45 ఎకరాలు ఇచ్చేందుకు ఆయా గ్రామాల రైతులు అంగీకరించడంతో పాటు పేర్ని హామీపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్డీఓ ఐ. కిషోర్, బందరు తహసీల్దార్ డి. సునీల్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, పెదకరగ్రహారం గ్రామ ఇన్‌చార్జి శొంఠి ఫరీద్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


కరగ్రహారం రైతులతో చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

క్లుప్తంగా

కడవకొల్లుకు సన్మానం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): వైఎస్సార్ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావును వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా పెదకళ్లేపల్లి వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్లు అరజా లక్ష్మీ తులసీ, పండలనేని అన్నపూర్ణ, వెంకటాపురం సర్పంచ్ తుమ్మా సోములమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలపూడి, దిమ్మలసెంటర్, కొత్తపేట, లక్ష్మణరావుపురం, ఎన్‌జీఓ కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ, సర్కారుతోట, కొబ్బరితోట, సీఎస్ఆర్ నగర్, గాంధీనగర్, బ్రహ్మపురం, పరాసుపేట, నరసింహ నగర్, బచ్చుపేట, నాయర్‌బడ్డీ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

- మచిలీపట్నంటౌన్: గొడుగుపేట, సర్కిల్‌పేట, జవ్వారుపేట, ఉల్లింగిపాలెం, వర్రెగూడెం, రాజుపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ భాస్కరరావు తెలిపారు.

మృతుని కుటుంబానికి సాయం

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు బండారు శివయ్య ఈ నెల 5వ తేదీన మృతిచెందాడు. డివిజన్‌లోని పింఛనుదారులు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 19 వేలను మృతుని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

చల్లపల్లి: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరిముల్లా పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

ఆముదార్లంక (చల్లపల్లి): ఆముదార్లంక నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో చల్లపల్లి ఎస్ఐ సీహెచ్.చినబాబు శుక్రవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడి చేశారు. గొరికపూడి సురేష్‌కు చెందిన ట్రాక్టరులో డ్రైవర్ గొరికపూడి ఆనంద్ పాల్ ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

పెడన: నందమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మచిలీపట్నం సబ్ డివిజనల్ యాంకర్ స్వామిబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, డ్వాక్రా మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఆటో–ఆర్టీసీ బస్సు ఢీ

ముఠా కార్మికునికి గాయాలు

రామానగరం (చల్లపల్లి): ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొన్న ఘటనలో ముఠా కార్మికుడు గాయపడ్డాడు. లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంలో ఈ ఘటన జరిగింది. మచిలీపట్నం నుంచి అవనిగడ్డ వెళుతున్న ఆర్టీసీ బస్సు రామానగరం సెంటర్‌లో ప్రయాణికులు దిగేందుకు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా వెనుక ఉన్న ఆటో అదుపు తప్పి బస్సు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం, ఆటో ముందు భాగం దెబ్బతిన్నాయి. ఆటో ట్రక్కులో ఉన్న ముఠా కార్మికుడు పిండి వెంకటేశ్వరరావు ముందుకు పడటంతో రెండు మోకాళ్లు దెబ్బతిన్నాయి. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు

పెడన: 15 ఏళ్ల వయస్సుగల బాలికను కిడ్నాప్ చేశారంటూ ఆమె తల్లి పెడన పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బాలిక మచిలీపట్నంలోని లేడీయాంప్తిల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం కాలేజీకి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన వారి వద్ద, స్నేహితుల వద్ద విచారణ చేసినా ఫలితం లేదు. బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించి మహేష్ అనే యువకుడు ప్రతి రోజూ ఆమెను ఫాలో అయ్యేవాడని, అతనిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవరత్నాలు పథకాలతో ఆదుకున్నారు

- సీఎం జగన్‌కు లబ్ధిదారుల కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వద్ద ఆనందం
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాల ద్వారా తమను ఆదుకుంటున్నారని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం పెదకళ్లేపల్లి గ్రామంలో జరిగింది. వైఎస్సార్ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వికాస్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికురాలు బండె రజని ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్నానని ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలిపింది. ఆకుశెట్టి సుబ్రహ్మణ్యంకు పింఛన్ వస్తుందని, తన కుమార్తె అమలేశ్వరి మానసిక, శారీరక ఎదుగుదల లేనందున ఆమెకు కూడా పింఛన్ ఇప్పించాలని కోరారు. అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని మరికొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిపై జగనన్న విజన్ విశాఖలో నిర్వహించిన సమ్మిట్‌లో పెట్టుబడులకు వచ్చిన కార్పొరేట్ దిగ్గజాలే నిదర్శనమన్నారు. రానున్న కాలంలో యువతకు మంచి భవిష్యత్‌ను ఇవ్వగల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్లు అరజా లక్ష్మీతులసి, పండలనేని అన్నపూర్ణ, ఆది రాంబాబు, సర్పంచ్‌లు తుమ్మా సోములమ్మ, గరికిపాటి వెంకటేశ్వరరావు, తైలం బ్రహ్మరాజు, కొండేటి రమేష్, అరజా చలపతిరావు, తోట కృష్ణాంజనేయులు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ పార్వతి తదితరులు పాల్గొన్నారు.


మహిళకు అందిన పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సమాజ మార్పు కోసం తపించిన సావిత్రీబాయి పూలే

వైఎస్సార్ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు

అవనిగడ్డ: తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే సమాజ మార్పు కోసం ఎంతగానో పరితపించారని ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. ఆమె ఆశయాలు ఆదర్శనీయమని చెప్పారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం శుక్రవారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు విద్య నేర్పించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న సావిత్రీబాయి పూలే సంఘ సంస్కర్తగా, మహిళా ఉద్యమ కారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, ఎస్సీ సెల్ నాయకులు నలుకుర్తి రమేష్, నాయకులు పాల్గొన్నారు.


అవనిగడ్డలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కడవకొల్లు తదితరులు

సూరపనేనిపాలెంలో..

ఘంటసాల మండలం సూరపనేనిపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బొకినాల కృష్ణ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను విద్యార్థులకు వివరించారు.

- మోపిదేవి: ఆడపిల్లల చదువుకు సావిత్రీబాయి పూలే విశేష కృషి చేశారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి అన్నారు. మండల కేంద్రం మోపిదేవి మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆడపిల్లల చదువుకై మహాత్మా జ్యోతిబాపూలేతో పాటు సావిత్రీబాయి పూలే చేసిన కృషిని, ఉపాధ్యాయినిగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఆమె జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు సావిత్రీబాయి పూలే ఏకపాత్రాభినయం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నాన్ ఏసీ స్లీపర్ సర్వీసు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మచిలీపట్నం డిపో నుంచి నూతనంగా ప్రవేశపెట్టిన హైదరాబాద్‌కు నాన్ ఏసీ స్లీపర్ బస్సు సర్వీసును శుక్రవారం రాత్రి ఆయన డిపో మేనేజర్ టి. పెద్దిరాజుతో కలిసి ప్రారంభించారు. ప్రతి రోజు రాత్రి 9.45 గంటలకు మచిలీపట్నం నుంచి హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు బస్సు బయలుదేరుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్ నోబుల్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

అవనిగడ్డ: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అజీజ్, కోశాధికారి ఆర్. నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెడన: కడుపు నొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 14వ వార్డుకు చెందిన సజ్జా హేమసుందరరావు (65) రెండు నెలల నుంచి కడుపు నొప్పి, ఆయాసంతో బాధపడుతున్నాడు. చికిత్స పొందుతున్నా తగ్గకపోవడంతో శుక్రవారం ఉదయం పందికొక్కుల మందుబిళ్లలను మింగాడు. కుటుంబ సభ్యులు గమనించి హేమసుందరరావును మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఇందిర ఫిర్యాదు మేరకు పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పథకాల లబ్ధిదారులకు రుణాలు అందించండి

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఆయా బ్యాంకుల అధికారులు రుణాలు అందించాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్‌లో శుక్రవారం వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, జగనన్న తోడు, స్వయం సహాయక సంఘాల రుణాలు తదితర అంశాలకు సంబంధించిన రుణాలు సకాలంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఇళ్లు, టిడ్కో గృహాల రుణాల లబ్ధిదారులకు రుణాలు మంజూరు వేగవంతం చేయాలన్నారు. గుడివాడలోని టిడ్కో గృహాలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో బ్యాంకు అధికారులు రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సుధారాణి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఫణిరాం కుమార్, నాబార్డు ఏజీఎం మిళింగ్ చౌసాల్‌కర్, ఎల్‌డీఎం సాయిరాం, జిల్లా పరిశ్రమల శాఖాధికారి ఎం. వెంకట్రావు, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

రైతు ఉత్పత్తుల సంస్థలను ఏర్పాటు చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): రైతు ఉత్పత్తుల సంస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్‌లో శుక్రవారం ఫార్మేషన్ అండ్ ప్రమోషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ అంశంపై కలెక్టర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మినుము, వేరుశనగ, చెరకు, వరి వంటి పంటలు పండించే రైతులు గ్రూపులుగా ఏర్పడి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో నాలుగు మండలాల్లో ఏర్పాటయ్యాయని చెప్పారు. మిగిలిన మండలాల్లో ఏర్పాటు చేయడానికి ప్రపోజల్స్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నాబార్డు డీడీఎం మిల్లింద్ సూసాల్కర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి జ్యోతి, డిస్ట్రిక్ ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ జ్యోతిర్మణి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 31, 47 డివిజన్లలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు పేర్ని కిట్టు శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. 31వ డివిజన్‌లో రూ. 20 లక్షలతో మూడు సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. శారదా నగర్ పీకేఎం కాలనీలోని సియోను చర్చి వెనుక ఉన్న 90 మీటర్ల రోడ్డును, టైలర్స్ కాలనీలోని మసీదు వద్ద 135 మీటర్ల రోడ్డును సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసే పనులను ప్రారంభించామని చెప్పారు. 47వ డివిజన్‌లో మునిసిపల్ ప్రైమరీ స్కూల్ వెనుక వైపు రూ. 7 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో 540 మీటర్ల మేర హెచ్‌డీపీఈ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. 31వ డివిజన్ కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్‌నోబుల్, వైఎస్సార్ సీపీ 47వ డివిజన్ ఇన్‌చార్జి గౌర శ్రీహరి, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

గూడూరు: ఈనెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు కోరారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి అల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓ సీహెచ్ సత్యసాయిబాబు, మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి వి.శివరామకృష్ణ, టి.మాధురి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

- పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఈనెల 14న జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ పార్వతి అన్నారు. పెదకల్లేపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యసిబ్బందితో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. శ్రీరామ్ ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశాలు, విద్యాశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంఈఓ కె. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ తరఫున ప్రధానోపాధ్యాయులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

జగనన్న కోసం పనిచేస్తాం

పాలకుర్తి ఇస్సాకు తదితరుల స్పష్టీకరణ

కృత్తివెన్ను: 30 ఏళ్లకు పైగా తెలుగుదేశం పార్టీకి సేవలు చేశాం.. ఏనాడు మాకు పార్టీ మేలు చేసింది లేదు.. గడిచిన నాలుగేళ్లలో జగనన్న పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అందుకున్నాం.. ఆయన కోసం పనిచేసి ఆయన రుణం తీర్చుకుంటాం అంటూ కృత్తివెన్ను మండలం పడతడికకు చెందిన పలువురు అన్నారు. మాజీ సర్పంచ్ పాలపర్తి ఇస్సాకుతో పాటు సుమారు 100 మంది తెలుగుదేశం నుంచి వైఎస్సార్ సీపీలో ఇటీవల చేరారు. వీరంతా శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, సర్పంచ్ మందపాటి ప్రదీప్‌కుమార్ సమక్షంలో తాము వైఎస్సార్ సీపీకి కట్టుబడి ఉంటామని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తామంటూ ప్రమాణం చేశారు. తాను 1995లో టీడీపీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచానని, అప్పటి నుండి పార్టీ కోసం ఎంతో కృషి చేశానని ఇస్సాకు తెలిపారు. అంత కాలం పార్టీకి సేవలు చేసినా కలగని ప్రయోజనం జగనన్న పాలనలో కలిగిందని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మేమంతా పార్టీలో చేరామని తెలిపారు. టీడీపీలో ఉన్న కొందరు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటి వారికి వచ్చే ఎన్నికల్లో మేము ఓట్ల రూపంలో సమాధానం చెబుతామన్నారు. పి. ఇస్మాయిల్, సువర్ణరాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కృత్తివెన్ను మండలం పడతడికలో టీడీపీ నుండి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు

బందరులో విద్యుత్ విజిలెన్స్ దాడులు

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అధిక లోడు వాడుతున్న వినియోగదారులకు రూ. 3.29 లక్షలను జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు, మచిలీపట్నం విద్యుత్ శాఖ ఈఈ ఎం. భాస్కరరావు అధికారులు 36 బృందాలుగా ఏర్పడి 929 గృహ సర్వీసులను, 861 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. 66 సర్వీసులకు అదనపు లోడు 120 కేడబ్ల్యూ మొత్తానికి రూ. 3,17,200 అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరీ కాకుండా వేరే కేటగిరీలో విద్యుత్‌ను వాడుతున్న ముగ్గురు వినియోగదారులను గుర్తించి వారికి రూ. 12 వేలు జరిమానా విధించారు. మచిలీపట్నంటౌన్, రూరల్, పెడన, పామర్రు ఏడీఈలు కృష్ణారెడ్డి, రామకృష్ణ, మాణిక్యాలరావు, సుందరరావు, మచిలీపట్నం డివిజన్‌లోని ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ భవన్ నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం

పురిటిగడ్డ (చల్లపల్లి):మచిలీపట్నంలో కృష్ణా జిల్లా విశ్రాంత పోలీస్ అధికారుల వెల్ఫేర్ భవన నిర్మాణానికి ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ రూ.2 లక్షల విరాళం అందించారు. శుక్రవారం పురిటిగడ్డలోని ఐవీఎం హోంలో విరాళాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు కె.హరి రాజేంద్రబాబుకు అందించారు. ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఎల్. రాంబాబు, సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ కాంట్రాక్ట్ ఉద్యోగాల అభ్యర్థులకు పరీక్షలు

మచిలీపట్నంటౌన్: జిల్లా గ్రంథాలయ సంస్థలో కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగుల నియామకానికి శుక్రవారం రాత పరీక్ష నిర్వహించారు. నాలుగు లైబ్రేరియన్లు, ఒక రికార్డ్ అసిస్టెంట్ పోస్టుకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు జరిగాయి. లైబ్రేరియన్ పోస్టుకు 152 మంది దరఖాస్తు చేసుకోగా 133 మంది పరీక్షకు హాజరయ్యారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు 34 మంది దరఖాస్తు చేసుకోగా 26 మంది పరీక్షకు హాజరయ్యారు. స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు పర్యవేక్షించారు. అనంతరం జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహించి అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచారు. అభ్యర్థులకు వచ్చిన మార్కుల ప్రకారమే ఉద్యోగానికి ఎంపిక చేస్తామని సంస్థ కార్యదర్శి రవికుమార్ తెలిపారు.